క్లుప్తంగా

మహాలక్ష్మి అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ



అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న విజయ రాజ్యలక్ష్మి తదితరులు

సీటీఆర్ఐ: గాడాల గ్రామంలోని వేంకటేశ్వర స్వామి పీఠంలో కొలువైన మహాలక్ష్మి అమ్మవారిని గురువారం ద్వారకా తిరుమల మాజీ బోర్డు సభ్యురాలు కొత్త విజయ రాజ్యలక్ష్మి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పుట్టింటి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాశులు, నక్షత్రాలతో కూడిన ఈ ఆలయం చాలా అద్భుతంగా ఉందని ప్రశంసించారు. అమ్మవారికి సూత్రాల తాడులో నాలుగు గ్రాముల బంగారం అందిస్తానని తెలిపారు. పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు మాట్లాడుతూ అమ్మవారు సర్వశుభయోగదాయక ఫలితాలు కలగచేస్తారన్నారు. ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్, మనగుడి- మన సేవ భారతీయ ఆధ్యాత్మిక సేవా సమితి చైర్మన్ ధరణికోట దుర్గా వెంకట హేమావతి, టి.వెంకట అప్పారావు, పడాల వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన లోలుగు తపస్వినీ అమృత గ్రాము బంగారాన్ని అమ్మవారి సూత్రాల్లోకి అందించారు. .

పేదలకు వితరణ



క్రీస్తు జననం నాటికను ప్రదర్శించిన విద్యార్థులతో కరస్పాండెంట్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: క్రిస్మస్‌ను పురస్కరించుకుని గురువారం బొమ్మూరులోని సెయింట్ఆన్స్ పాఠశాలలో పేదలకు అన్నదానం, దుప్పట్లు పంపిణీ చేశారు. పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ షీనా, ప్రిన్సిపాల్ సిస్టర్ ఝాన్సీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితాల్లోనూ ఆనందాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపడమే క్రిస్మస్ పరమార్థమన్నారు. ఈ సందర్భంగా ఆల్కాట్‌తోటలోని సుమన్ వృద్ధాశ్రమ అనాథలకు, బొమ్మూరు వివేకానంద మహారోగి ఆరోగ్యకేంద్రంలోని రోగులకు, వేమగిరిలో పేదలకు వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే శాటిలైట్‌సిటీలోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన క్రీస్తు జననం నాటిక, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ రోస్‌జోస్, సిస్టర్ జోస్ఆన్, సిస్టర్ రూబీ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు అనైతికం



అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న విశ్వేశ్వరరెడ్డి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అమిత్ షా, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మోతా శారద, పట్నాల శ్రీనివాస్, అబ్దుల్లా షరీఫ్, డాక్టర్ వడయార్ పాల్గొన్నారు.

ఆ వ్యాఖ్యలు బాధాకరం

సీటీఆర్ఐ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు బాధాకరమని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు సానబోయిన రామారావు మాట్లాడుతూ అంబేడ్కర్ ఒక్క కులానికో, ఒక వర్గానికో నాయకుడు కాదని, దేశం గర్వించదగిన వ్యక్తి అన్నారు. ప్రపంచ దేశాలలో మన రాజ్యాంగానికి ప్రత్యేకత కల్పించిన వ్యక్తిపై దురహంకార వ్యాఖ్యలు చేయడం అనైతికమన్నారు. సమావేశంలో ఎల్‌వీ ప్రసాద్, జార్జి ఆంటోనీ, ఎం.సత్యనారాయణ, షేక్ అసుదుల్లా అహ్మద్ పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు అడిగితే బెదిరింపులు

సీతానగరం: తమకు రావాల్సిన ధాన్యం డబ్బులను అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నాడని దుద్దిపూడి సూరిబాబుపై బొబ్బిల్లంకకు చెందిన పెండ్యాల అవిస్వామి, దాసరి వీరాస్వామి ఫిర్యాదు చేశారు. కొవ్వూరు మండలం పసివేదలకు చెందిన ధాన్యం కొనుగోలు ఏజెంట్ సూరిబాబుకు వీరిద్దరూ ధాన్యం విక్రయించారు. ఈ నేపథ్యంలో అవిస్వామికి రూ.23 లక్షలు, వీరాస్వామికి రూ.21 లక్షలు రావాల్సి ఉంది. ఆ డబ్బులను అడుగుతుంటే సూరిబాబు బెదిరిస్తున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై డి.రామ్ కుమార్ కేసులు నమోదు చేశారు.

క్రిస్మస్ సందడి

- నగరంలో పండగ జోష్
- ఇళ్ల ముందు కనువిందు చేస్తున్న స్టార్లు
- విద్యుద్దీపాలతో మెరిసిపోతున్న చర్చిలు
- ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కంబాలచెరువు: నగరంలో ఎక్కడ చూసినా క్రిస్మస్ సందడి కనిపిస్తోంది. శాంతిదూత, పాపుల రక్షకుడు ఏసుక్రీస్తు పుట్టిన రోజును ఘనంగా జరుపుకోవడానికి క్రైస్తవులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. క్యాలెండర్ ప్రకారం డిసెంబర్ 25న ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తారు. అయితే డిసెంబర్ ప్రారంభం నుంచి ఇవి మొదలయ్యాయి. ఒక రకంగా డిసెంబర్‌ను క్రిస్మస్ నెలగా చెప్పుకోవచ్చు.

విద్యుద్దీపాల వెలుగులు

క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవుల ఇళ్లు, చర్చిల ముందు స్టార్లు వెలుగులు విరజిమ్ముతున్నాయి. చర్చిలను అందమైన విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. పేద, ధనిక తారతమ్యం విడనాడి అందరూ ఒకే చోట చేరి ఆ దేవదేవుని పుట్టుకను స్మరించుకుంటూ, మరికొద్ది రోజుల్లో రానున్న కొత్త సంవత్సరంలో తామంతా బాగుండాలని ప్రార్థనలు చేస్తున్నారు. డిసెంబర్ 25న క్రిస్మస్ అయినా చాలా వరకు పాత, కొత్త సంవత్సరం కలిసి వచ్చేలా డిసెంబర్ 31 రాత్రి క్రిస్మస్ వేడుక ప్రారంభించి నూతన సంవత్సరం వచ్చే గడియల వరకు ఆ సంబరాలు జరుపుకొంటారు.

ముస్తాబైన ఇళ్లు

పండగ నేపథ్యంలో క్రైస్తవులు ఇళ్లు అందంగా ముస్తాబయ్యాయి. మార్కెట్‌లో లభ్యమవుతున్న రకరకాల విద్యుత్ బల్బులు, సీరియల్ సెట్లు, క్రిస్మస్ సూచికను తెలిపే క్రిస్మస్ తాత బొమ్మ, ఈడ్‌లు, క్రిస్మస్ స్టార్లు, పశువుల పాక, రంగురంగుల బెలూన్లతో ఇళ్లను అలంకరించుకున్నారు. తమ తోటి వారందరినీ పిలుచుకుని ఇంటిలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకుంటున్నారు. క్రిస్మస్ బహుమతులను ఒకరికొకరు అందించుకుంటున్నారు. దీంతో రాజమహేంద్రవరంలోని నల్లమందు సందు, దేవీచౌక్, మెయిన్‌రోడ్డు వంటి ప్రాంతాలన్నీ క్రిస్మస్ సామగ్రితో కళకళలాడుతున్నాయి.



క్రిస్మస్‌ను పురస్కరించుకుని నగరంలోని ఓ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల సెట్టింగ్



ఆకట్టుకుంటున్న క్రిస్మస్ బహుమతులు





దుకాణాలలో..

క్రిస్మస్ పండగ సందర్భంగా దుకాణాల్లో సందడి నెలకొంది. పెద్ద ఎత్తున కొనుగోళ్లు జరుగుతున్నాయి. ప్రముఖ షోరూమ్‌లతో పాటు హోటళ్లు, దుస్తుల దుకాణాలు, రెస్టారెంట్లు వంటి వాటిలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. క్రీస్తు జనన వృత్తాంతాన్ని తెలిపేలా రూపొందించిన పశువుల పాక, క్రిస్మస్ తాత వంటి బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి.

అందరి పండగ



క్రిస్మస్ అంటే సమస్త మానవాళి జరుపుకొనే పండగ. డిసెంబర్ వచ్చిందంటే మాకు ఎంతో ఆనందం. ఏడాది చివరిలో వచ్చే ఈ పండగకు దూర ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులందరం ఒక్కచోటుకు చేరుకుంటాం. ఆ దేవదేవుడిని ప్రార్థించుకుంటాం. ఏడాదంతా చల్లగా కాపాడినందుకు ఆయనకు కృతజ్ఞతలు చెబుతూ మోకరిల్లుతాం. గతంలో చర్చికి వెళ్లే వారి ఇళ్లలో మాత్రమే క్రిస్మస్ నెల వచ్చిందనే సూచికగా స్టార్లు కనిపించేవి. ఇప్పుడు అందరి ఇళ్లలోనూ వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఇది ఆనందించదగిన విషయం.

– పి.ఎర్నెస్ట్ మోజెస్, దైవబోధకుడు, రాజమహేంద్రవరం.

మీ నిర్లక్ష్యంతో మాకు చెడ్డపేరు తేవొద్దు



సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

సీటీఆర్ఐ: మీ నిర్లక్ష్యంతో తమకు చెడ్డ పేరు తీసుకురావొద్దని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన గురువారం మధ్యాహ్నం స్థానిక కూటమి నాయకులతో కలిసి 45, 46 వార్డుల పరిధిలోని 83, 84, 85, 86 సచివాలయాల సముదాయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎవరు ఎక్కడ ఉన్నారనేది అడిగి తెలుసుకున్నారు. 86వ సచివాలయం తాళం వేసి ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అడ్మిన్ సెలవులో ఉన్నారని చెప్పగా, ఆ తర్వాత బాధ్యత తీసుకోవాల్సిన మహిళా ఉద్యోగి లక్ష్మీసూర్య కూడా లేకపోవడంతో ఆమెను తొలగించి మరొకరిని నియమించాలని అధికారులకు సూచించారు. ఈ విషయంపై కమిషనర్‌తో మాట్లాడతానని చెప్పారు. అందరూ ఫీల్డులోకి వెళ్లకుండా ఒకరైనా ఆఫీసులో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

సదస్సులతో భూవివాదాల పరిష్కారం



సదస్సులో పాల్గొన్న డిప్యూటీ కలెక్టర్ వేదవల్లి, మండల ప్రత్యేకాధికారి జ్యోతి, తహసీల్దార్ జయసూర్యకుమార్

రాజమహేంద్రవరం రూరల్: భూవివాదాల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు పోలవరం ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ వేదవల్లి అన్నారు. పిడింగొయ్యి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వేదవల్లి, మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి కేఎస్ జ్యోతి పాల్గొన్నారు. పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని ఆర్ఎస్ నంబర్ 616, 617లో 15.67 సెంట్లను ఎక్స్ తాడి టాపర్స్ ఫీల్డ్ లేబర్ మల్టిపర్పస్ కో ఆపరేటివ్ సొసైటీ, సంఘ సభ్యుల పేరున రెవెన్యూ రికార్డులలో సూచించబడుతుందన్నారు. అయితే కొందరు తప్పుడు సరిహద్దులు, కొలతల పేరుతో భూమిలోకి ప్రవేశించారని తీగిరెడ్డి వెంకట రామారావు డిప్యూటీ కలెక్టర్ వేదవల్లికి వివరించారు. రూరల్ తహసీల్దార్ జయసూర్యకుమార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో 17 అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



బీఆర్ఏజీఎంఆర్ పాలిటెక్నిక్ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

రాజమహేంద్రవరం రూరల్: చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ఏజీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో జరిగిన 27వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ రీజినల్ మీట్ 2024–25 విజేతలకు గురువారం సాయంత్రం బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలను ఒక రోల్ మోడల్‌గా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు, గైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామానుజం, కళాశాల జనరల్ సెక్షన్ హెడ్ ఎంపీఎస్ మురళీకృష్ణ, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ మత్సేటి ప్రసాద్ మాట్లాడారు. అనంతరం స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో విజేతలకు ట్రోఫీలు, పతకాలను అందజేశారు. కార్యక్రమంలో జీఎంఆర్ పాలిటెక్నిక్ ఇన్‌చార్జి పీడీ కె.నరసింహారావు, అథ్లెటిక్స్ కోచ్ రమణ, కబడ్డీ కోచ్ సాయికోటి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్‌గా జీఎంఆర్ పాలిటెక్నిక్

ఓవరాల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ చాంపియన్‌గా డాక్టర్ బీఆర్ఏజీఎంఆర్ పాలిటెక్నిక్ (బొమ్మూరు), ఇండివిడ్యువల్ చాంపియన్‌గా జి.అవినాష్ కుమార్ (ఆదిత్య 249), ఓవరాల్ గేమ్స్ చాంపియన్‌గా గైట్ కళాశాల, ఓవరాల్ స్పోర్ట్స్ చాంపియన్‌గా ఆదిత్య కళాశాల నిలిచాయి. కబడ్డీలో గైట్ కళాశాల విన్నర్‌గా, బీఆర్ఏజీఎంఆర్ (బొమ్మూరు)రన్నర్‌గా, వాలీబాల్ పోటీల్లో వీఎస్ఎం కళాశాల (రామచంద్రపురం) విన్నర్‌గా, ఆంధ్రా పాలిటెక్నిక్ (కాకినాడ) రన్నర్‌గా నిలిచాయి.

నన్నయలో క్రికెట్ పోటీలు



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వీసీ శ్రీనివాసరావు

రాజానగరం: ఢిల్లీ నుంచి గల్లీ వరకు క్రికెట్ విస్తరించిందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను గురువారం ఆయన బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటేందుకు విద్యార్థులు పోటీ పడాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ ఈ పోటీలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో యూనివర్సిటీ టీమ్‌ను ఎంపిక చేస్తామన్నారు. వచ్చే ఏడాది జనవరిలో చెన్నైలోని మద్రాస్ యూనివర్సిటీలో జరిగే దక్షిణ భారత పురుషుల క్రికెట్ పోటీలలో ఈ టీమ్ పాల్గొంటుందన్నారు.

సీపీఐ శత వార్షికోత్సవ పుస్తకం ఆవిష్కరణ



సీపీఐ శత వసంతాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రకాశం నగర్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆవిర్భవించి ఈ నెల 26వ తేదీకి వందేళ్లు పూర్తవుతుందని, ఈ సందర్భంగా నిర్వహించే శత వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ శత వసంతాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. మధు మాట్లాడుతూ శత వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా సభలు, సమావేశాలు, పతాక ఆవిష్కరణలు ఘనంగా నిర్వహిస్తామని, ఈ నెల 27న నగరంలో ఎర్ర కవాతు జరుపుతామన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు అర్హులైన పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు నివాస స్థలాలు ఇచ్చి, ఇల్లు కట్టుకోవడానికి రూ.నాలుగు లక్షల ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయిన దానిపై ప్రస్తావన లేదన్నారు. సమావేశంలో నగర కార్యదర్శి కొండలరావు, సప్పా రమణ తదితరులు పాల్గొన్నారు.

పదిలో నూరుశాతం ఫలితాలు సాధించాలి



స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో వాసుదేవరావు

కడియం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు సాధించాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతేడాది ఈ పాఠశాల మండలంలో ప్రథమ స్థానం సాధించిందన్నారు. ఆ స్ఫూర్తిని ఈసారి కొనసాగించాలన్నారు. ఈ సందర్భంగా సీడీ గ్రేడ్ విద్యార్థుల కోసం తెలుగు ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ తయారు చేసిన స్టడీ మెటీరియల్ ప్రారంభించారు. ఈ మెటీరియల్‌ను డీసీఈబీ ద్వారా జిల్లా అంతటా పంపిస్తామన్నారు. రాబోయే 90 రోజులు చాలా కీలకమని, విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

జాతీయ రహదారిపై యాసిడ్ పొగ



ట్యాంకర్ నుంచి యాసిడ్ లీకై వెలువడుతున్నపొగ

రాజానగరం: స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల సమీపంలో గురువారం ఉదయం జాతీయ రహదారిని యాసిడ్ (హెచ్‌సీఎల్) పొగలా కమ్మేసింది. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీవ్రత పెరగకుండా చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. విశాఖపట్నం నుంచి దేవరపల్లికి యాసిడ్ (హెచ్‌సీఎల్) లోడుతో వెళుతున్న ట్యాంకర్‌కు దిగువ భాగంలో రెండు చోట్ల రంధ్రాలు పడ్డాయి. వాటి నుంచి యాసిడ్ రహదారిపై కారుతూ పొగలా కమ్మేసింది. ఈ పొగ సోకిన కొందరు ప్రయాణికుల కళ్లలో మంట పుట్టి, దురదలు కూడా వచ్చాయి. సమాచారం అందుకున్న రాజమహేంద్రవరం, కోరుకొండ అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా ప్రాంతానికి చేరుకుని, లీకవుతున్న యాసిడ్ సాంద్రతను తగ్గించడానికి పైపులతో నీటిని చల్లారు. పక్కనే ఉన్న డ్రైనేజీలోకి ట్యాంకర్‌లోని యాసిడ్‌ను వదిలేశారు. ఈ యాసిడ్‌ను పీల్చడం వల్ల ఊపిరితిత్తులకు హాని కలుగుతుందని అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో ట్యాంకర్‌లో 35 టన్నుల హెచ్‌సీఎల్ లిక్విడ్ ఉంది.

దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా...

- లక్ష్మీ గణపతికి లక్ష కుడుములతో అభిషేకం
- మొక్కు తీర్చుకున్న ఆకివీడు భక్తులు



కుడుముల తయారీలో నిమగ్నమైన వివిధ గ్రామాలకు చెందిన మహిళా సేవకులు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన శ్రీ లక్ష్మీ గణపతికి భక్తులు లక్ష కుడుములతో అభిషేకం చేశారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు గ్రామానికి చెందిన టీపీ రెడ్డి, గంగ దంపతులు గురువారం ఈ పవిత్ర క్రతువును చేపట్టారు. వీరు 28 ఏళ్లుగా స్వామివారిని కొలుస్తున్నారు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం తమ కోరిక తీరితే లక్ష కుడుములు సమర్పించుకుంటామని మొక్కుకున్నారు. వారి కోరిక నెరవేరడంతో స్వామికి మొక్కు తీర్చుకున్నారు. గురువారం లక్ష్మీ గణపతి ఆలయం వద్ద ఉదయం నుంచి స్వామివారికి పంచామృతా భిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష కుడుములు అభిషేకించారు. ఈ క్రతువులో అందరినీ భాగస్వాములు చేశారు. గ్రామస్తులే కాకుండా చుట్టు పక్కల గ్రామాలకు చెందిన సేవకుల బృందాలు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ కుడుముల తయారీకి సహకరించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సత్తి మణి, ఆదిలక్ష్మి దంపతులు కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. స్వామి వారి దగ్గర ఉంచిన కుడుములను ఆటోల ద్వారా చుట్టు పక్కల గ్రామాలకు తరలించి భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆలయ కమిటీ అధ్యక్షుడు తమ్మిరెడ్డి నాగశ్రీనువాస్ రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



బిక్కవోలులో లక్ష కుడుముల అభిషేకంలో పాల్గొన్న టీపీ రెడ్డి దంపతులు

అందుబాటులో ప్రొవిజనల్ జాబితా

కంబాలచెరువు: వైద్య, ఆరోగ్యశాఖ జోన్-2 పరిధిలో చేపట్టిన ఫార్మాసిస్ట్ గ్రేడ్ 2 పోస్టులకు సంబంధించి అభ్యర్థుల ప్రొవిజనల్ జాబితాను ఈ నెల నుంచి అందుబాటులో ఉంచామని వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పద్మా శశిధర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. దీనికి సంబంధించి అభ్యర్థుల అభ్యంతరాలు స్వీకరిస్తున్నామన్నారు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా తెలపాలన్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, మెరిట్, రిజర్వేషన్ నియమాల ప్రాతిపదికన జరుగుతుందన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించే దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు.

28 నుంచి సీపీఎం మహా సభలు

ప్రకాశం నగర్: భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) (సీపీఎం) 24వ జిల్లా మహా సభలను ఈ నెల 28, 29వ తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్ పిలుపునిచ్చారు. శ్యామలా సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం మహాసభల లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు మున్సిపల్ స్టేడియం నుంచి కోటిపల్లి బస్టాండ్ వరకు ప్రజా ప్రదర్శన జరుగుతుందన్నారు. అనంతరం మూడు గంటల నుంచి కోటిపల్లి బస్టాండ్‌లో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. డిసెంబర్ 29న ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. గడచిన మూడేళ్లలో చేసిన ప్రజా పోరాటాలను సమీక్షించేందుకు ఈ మహాసభలో చర్చలు జరుగుతాయన్నారు.

దొంగతనాల నివారణకు చర్యలు



వెంకటేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్

కడియం: ఇళ్లలో దొంగతనాల నివారణకు లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను అమలు చేస్తున్నామని కడియం ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఈ విధానంలో ఇంటికి పూర్తి భద్రత లభిస్తుందన్నారు. పండగలు, శుభకార్యాలు, ఇతర పనులపై ఇంటికి తాళం వేసి ఊళ్లు వెళ్లేవారు ఆ విషయాన్ని పోలీసులకు తెలపాలన్నారు. ఆయా ఇళ్లకు ఉచితంగా నిఘా కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇంట్లోకి దొంగలు చొరబడితే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం వస్తుందన్నారు. వెంటనే పోలీసులు అప్రమత్తమై దొంగలను పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. అవసరమైన వారందరూ ఎల్‌హెచ్‌ఎంఎస్ సర్వీసును వినియోగించుకోవాలని కోరారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి గురువారం తన నివాసంలో లబ్ధిదారులకు అందజేశారు. హుకుంపేటకు చెందిన ప్రగళ్లపాటి కల్పనకు రూ.7 లక్షలు, మంతెన శ్రీరామ్మూర్తికి రూ.2,22,731, కాతేరుకు చెందిన జొన్నాడ వీర వెంకట సూర్యసాయికి రూ.లక్ష, వలెపు ఈశ్వర్‌కు రూ.61,572, దుళ్ల గ్రామానికి చెందిన వట్టి తలుపులమ్మకు రూ.40 వేలు చొప్పున పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు మత్సేటి ప్రసాద్, నున్న కృష్ణ, బొప్పన నానాజీ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల : విడుదల–2
సూర్యమినీ : ముఫాసా
సూర్యప్యాలెస్ : యుఐ
స్వామి : ముఫాసా
శివజ్యోతి : పుష్ప–2
అనుశ్రీ : బచ్చలమల్లి
రాజా : పుష్ప–2
ఊర్వశి : ముఫాసా
మేనక : లక్కీభాస్కర్
రంభ : మిస్‌యూ
కుమారి : ముఫాసా
అప్సర : పుష్ప–2
అశోక : బచ్చలమల్లి

నామవరం
వీఎస్ మహల్ : పుష్ప–2

ధవళేశ్వరం
మురళీకృష్ణ : పుష్ప–2, మార్నింగ్ షో విడుదల

కడియం
వెంకటసూర్య : ముఫాసా, పుష్ప–2